తుమ్మల్లో అస్తమయం

బయట ఎవరో అస్పష్టంగా, అనుమానంగా తలుపుతట్టారు. టేబులు ముందు కుర్చీలో కూర్చుని, లెక్కలు రాసుకుంటున్న విశ్వానంద, ఆ వైపు ఓ మారుచూసి -

"పాడులోకానికి అంతస్సును చూసేశక్తి నశించింది. అంతా బాహ్య చిహ్నాలు - వాటికి

గౌరవం!" అనుకుంటూ, లెక్కల పుస్తకాలు అడుక్కినెట్టి, అక్కడినుంచి భాగవతాన్నీ, భగవద్గీతనూ బైటికి లాగాడు. భాగవతాన్ని పైన పడవేసి, భగవద్గీత పేజీలు తీసిచూస్తూ –

"ఎవరో? లోపలికి రావచ్చు" అన్నాడు.

దాదాపు పాతిక సంవత్సరాల యువకుడు తలుపుతోసుకొని గదిలో అడుగుపెడుతూ విశ్వానందకు నమస్కరించాడు.

విశ్వానంద భగవద్గీత మీద నుంచి తల పైకెత్తి "ఏం పని!" అని ప్రశ్నించాడు.

"తమవద్ద క్లర్కు పోస్టు ఖాళీగా వుందని...."

యువకుడు మాట పూర్తిచేయకుండానే, విశ్వానంద భగవద్గీతను టక్కున మూసేసి "ఆc! ఆc ! ఖాళీ వుంది. రా! కూర్చో" అని కుర్చీ చూపించాడు.

ఎంతో నమ్రతతో, అణకువతో వచ్చి ఆ యువకుడు ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు.

"నీ పేరు?"

"కృష్ణారావు"

"ఎంతవరకు చదివావ్?"

"స్కూల్ ఫైనల్–"

"కాని ప్యాసవలేదు? ఆc!" విశ్వానంద సూటిగా ఆ యువకుడి ముఖంలోకి చూస్తూ, యీ ప్రశ్న వేశాడు.

"ప్యాసవలేదు. రెండుసార్లు తప్పాను" – బెదురుగా ఆ యువకుడు అన్నాడు.

విశ్వానంద విజయోత్సాహంతో అతడి వంక చూస్తూ –

"నాకు తెలుసు, అందుకనే నిన్ను సూటిగా 'ప్యాసవలేదు గదూ' అని అడిగాను. నిజం తెలుసుకోవాలని నీకుంటే – నువ్వు మూడోమారు పరీక్ష కెళ్ళినా ప్యాసయేవాడివి కాదు"

ఒక నిమిషం యిద్దరూ నిశ్శబ్దంగా వూరుకున్నారు. విశ్వానంద భాగవతాన్ని చేతిలోకి తీసుకుంటూ "ఏ విధి బాటుపడ్డ గలదే భువి నల్పునకున్। అన్న పద్యం వచ్చా?" అన్నాడు.

కృష్ణారావు కుర్చీలో విసుగ్గా యిటు నుంచి అటు జరిగాడు. తలవంచుకునే "చదివిన గుర్తు. కాని మర్చిపోయాను!" అన్నాడు.

"నీకు కర్మసిద్ధాంతంలో నమ్మకం వుందా!"

కృష్ణారావు తల దిమ్మెత్తిపోయింది. స్ఫుటంగా ముఖం మీద కనిపించే విసుగుతో అతడు విశ్వానంద వంక చూశాడు. విశ్వానంద ఒక చిరునవ్వు నవ్వి –

"ఉద్యోగం కోసం వచ్చిన నిన్ను, యీ ప్రశ్నలు ఎందుకేస్తున్నానో నీకు అర్థం కాకపోవచ్చు. నా ప్రశ్నలకు నీవు యివ్వబోయే జవాబులు కూడా నాకు తెలుసు. మొదట్లో చెప్పాను – స్కూలు ఫైనల్ ప్యాస్ కాలేదని. కాని ఎందుకడుగుతున్నానంటే – "

విశ్వానంద కుర్చీలో నుంచి లేచి బీరువా దగ్గిరకు వెళ్ళాడు.

కృష్ణారావు ఆశ్చర్యంతో, భయంతో అతడి వైపు చూస్తున్నాడు.

విశ్వానంద బీరువాలో నుంచి ఒక పెద్ద కాయితాల కట్టను లాగుతూ -

"ఈ విద్యాలయం పేరు నీకు తెలుసుగదా?" అన్నాడు.

"తెలుసు. విశ్వానంద వృత్తివిద్యాలయం" - కృష్ణారావు తడబడుతూ ప్రత్యుత్తరం యిచ్చాడు.

"అంటే" అంతటితో ఆమాట ఆపి, విశ్వానంద కాయితాల కట్టతో వచ్చి, తిరిగి కూర్చొని ప్రారంభించాడు.

"అంటే - వృత్తిపనుల ద్వారా మానవుల్ని ఆ విశ్వకర్త దగ్గిరకు చేర్చాలనేది, నా ఆశయం. అంటే - నాలో యీ వుద్దేశం కలిగించిన, ఆ విశ్వసృష్టికారుని ఆశయం! ఆజ్ఞ! ఆకాంక్ష! అంటే - ఒక్కమాటలో యీ విద్యాలయం, ఆపైన వున్న ఆ లోకానికి, కింద వున్న యీ లోకానికీ ఒక నమ్మకమైన నిచ్చెన అన్నమాట. కనుక నీకు వుద్యోగం యిచ్చేముందు నిన్ను గురించి నీ మాటల్లోనే తెలుసుకోవాలి. నాకు తెలుసుకునే సాధనాలు వేరే వున్నా, వాటిని, వూరికే నీ మాటల్తో సరిచూసు కోడానికి మాత్రమే వుపయోగించుకుంటాను"

కృష్ణారావుకు మాదీఫలరసాయనం దొరికితే బాగుండుననిపించింది. బలమైన దాహం కలిగి నాలుక పీక్కుపోసాగింది. అతడు కుర్చీలోనుంచి లేస్తూ -

"మంచినీళ్ళు కావాలి" అన్నాడు.

విశ్వానంద దూరంగావున్న కూజా వైపు చేయి వూపుతూ "నాకూ చాలా పనివుంది. త్వరగా రా" అన్నాడు విసుగ్గా.

తిరిగి సంభాషణ ప్రారంభమయింది.

ఈసారి కృష్ణారావులో ఆ భయం, అనుమానం నశించి, కొంత ధీమాగా కూర్చున్నాడు.

విశ్వానంద నోటు పుస్తకంమీద పెన్సిలు ఆనించి -

"నీ రాజకీయాలు - కమ్యూనిస్టువా?"

"అసలు నాకు రాజకీయాలు లేవు"

"అబద్ధం. ఈ రోజుల్లో రాజకీయాలులేని మనిషి అంటూ ఎవడూ వుండడు. సోషలిస్టువా?"

"కాదు. కాని సోషలిజం అంటే కొంత అభిమానం"

"అలా దారికి రా! కాని యీ రోజు పత్రికల్లో ప్రచారమవుతున్న సోషలిజం కాదు నాది. ధనికుని మధ్యా బీదవాని మధ్యా సమానత్వాన్ని సాధించడంకాక; దేవుని మధ్యా మానవుని మధ్యా సమానత్వాన్ని - అంటే సోషలిజాన్ని - సాధించడమే నా లక్ష్యం. అంటే ఓ నూతనమైన అద్వైతం"

"క్షమించండి. అవన్నీ నాకు తెలియవు"

"ఈ విద్యాలయంలో చేరిన తరువాత అన్నీ నీకు తెలుస్తయ్. కమ్యూనిస్టువు కానందుకు మాత్రం సంతోషిస్తున్నాను. మలయాలో వాళ్ళు చూడు! కన్సర్వేటివ్ ప్రభుత్వం క్రింద వుండమంటూ పోట్లాడారు బాగానే వుంది. కాని యీనాడు ఇంగ్లండులో సోషలిస్టు ప్రభుత్వం వున్నా, దానికిందా వుండమంటూ పోట్లాడుతున్నారు! పూర్వజన్మలో చేసిన సుకృతాన్ని బట్టి ఈ జన్మలో అక్కడక్కడ

కొద్దిమంది, ఐశ్వర్యవంతులుగా పుడతారు. వాళ్ళను కూలదోయాలనడం, దైవశాసనధిక్కారం కాదా? వాళ్ళు వాళ్ళు చేసుకున్న పుణ్యాన్ని బట్టి, యీ లోకంలో వాళ్ళకు తగినట్టుగా సౌకర్యాలు కలిగించే యీశ్వరాజ్ఞను ధిక్కరించడానికి వీళ్ళెవ్వరు?"

"మీరు రాజకీయాలు బాగా చదివారు. కాని...నేను..."

"చాలు. చక్కగా గ్రహించావు. ఆ మాత్రం గ్రహణశక్తి నీకున్నట్లయితే నీవు ఉద్ధరింపబడే అవకాశాలున్నయ్. ఇంతవరకు యిద్దర్ని - గడ్డు నాస్తికులను నరకబాధల నుంచి కాపాడాను. కాని కొంత ఆలస్యంగా ఆఖరు నిముషాల్లో...దైవఆజ్ఞ!" - అర్థనిమీలిత నేత్రాలతో విశ్వానంద యింటికప్పు వంక చూస్తున్నాడు.

కృష్ణారావు రెండు నిమిషాలు ఆగి -"నా ఉద్యోగం మాట ఏమంటారు?" అన్నాడు.

విశ్వానంద ధ్యానసముద్రనుండి బయటపడి -

"నలభై రూపాయల జీతం, రెండుసార్లు భోజనం - యిష్టమేనా?" అన్నాడు.

"అంతా మీ యిష్టం" - కృతజ్ఞతతో కృష్ణారావు కళ్ళు మెరిసినై. గొప్ప అంతస్తు. కాని, పైకి వట్టి చాదస్తుడులా కనబడుతున్నాడు, గొప్ప హృదయం.

విశ్వానంద భగవద్గీతా భాగవతాలను ఒక ప్రక్కకు నెట్టి అడుగునుంచి లెక్కల పుస్తకాన్ని బయటకు లాగాడు. ఆవర్జా పుస్తకాల్ని కృష్ణారావుకు చూపుతూ -

"ఈ పుస్తకం, యింకా దీనికి సంబంధించిన నాలుగైదు పుస్తకాలు నీ స్వాధీనంలో వుంటాయి. లెక్కలు జాగ్రత్తగా రాయడమే నీ పని. ఈ పని ఎక్కువ టైము తీసుకోదు. కనక తీరుబడికాలంలో, పనివాళ్ళంతా సరిగా పనిచేస్తున్నారో లేదో, నూలూ, ఏకులూ వాటన్నిటి విషయంలో తగినంత మెలకువతో జాగర్తగా వుండాలి. నీకు ముందే హెచ్చరిక యిస్తున్నాను - వాళ్ళంతా దొంగలు"

"పనివాళ్ళు ఎంతమంది ఉంటారు?"

"నలభై అయిదు మగ్గాలు - వాటిమీద పనిచేసేవాళ్లు అరవై యిద్దరు. అందరూ గజదొంగలు. ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా మగ్గంతోకూడా పారిపోయే సరుకు"

కృష్ణారావుకు భయం కలిగింది. అంతమంది పనివాళ్ళు నిజంగా అలాంటి దొంగలే అయితే తను వొక్కడు ఎంత జాగ్రత్తగావుండి మాత్రం, ఏం చేయగలడు? అయినా ఏదో విధంగా పని చేయాలి. తప్పదు. మంచి వుద్యోగమే దొరికింది. కనీసం యింటికి పాతిక రూపాయలన్నా పంపుకోవచ్చు.

"ఏమిటీ ఆలోచిస్తున్నావ్?" - విశ్వానంద గంభీరంగా అన్నాడు.

"ఆః. ఏమీలేదు" కృష్ణారావు తడబడ్డాడు - "ఉండేందుకు రూము -"

"రూము కాదు. మంచి యిల్లు యిస్తాను. ఆ పడమటి వైపున తుమ్మచెట్ల పక్కన వున్న యిల్లు ఖాళీగానే వుంది"

కృష్ణారావుకు కంపరమెత్తింది. వచ్చేటప్పుడు ఆ యింటి పక్కగానే వచ్చాడు. చుట్టూ తుమ్మచెట్లూ, జిల్లేడు మొక్కలూ -

"అక్కడ అన్నీ తుమ్మలూ, జిల్లేడు మొక్కలూ...."

విశ్వానంద ఆశ్చర్యంగా అతడి వంక చూస్తూ "అవిలేంది ఎక్కడ? ఈ విద్యాలయం వుద్దేశ్యం యిదివరకే చెప్పాను. భగవంతుడి సృష్టిలో, దృష్టిలో గులాబీ చెట్టుకున్న విలువ తుమ్మచెట్టుకూ వుంది; మల్లె మొక్కకున్న ప్రయోజనం జిల్లేడు మొక్కకూ వుంది. ఈశ్వర రూపమైన ప్రకృతిని పాడుచేయదలచుకోలేదు. అందుకనే యీ విద్యాలయం చుట్టూ వున్న నలభై ఎకరాల పొలాన్నీ, అందులోని వృక్షజాతుల్నీ వున్నవి వున్నట్టుగానే వుంచాను"

"కాని ఒంటరిగా రాత్రిపూట అక్కడ వుండడమంటే..."

తక్కిన మాట విశ్వానంద నవ్వులో వినబడకుండా పోయింది.

"భయం! అంతేనా అబ్బాయ్. నేను చెప్పేది విను. ఈశ్వరుడిమీద భక్తివిశ్వాసాలు మనకున్నంత వరకు ఆయన్ని కూడా మనం లెక్క చేయవలసిన అవసరం వుండదు! నన్ను గురించి ఎన్నో కాకులు ఏమేమో కూస్తున్నాయి. ఎన్నో కుక్కలు ఏదేదో మొరుగుతున్నాయి. నేను లెక్క చేస్తున్నానా? రెండు మగ్గాలతో పని ప్రారంభించి యిప్పుడు ఆంధ్రదేశానికంతకీ – వాళ్ళకి కట్టాలని యిష్టముంటే, అందుకు సరిపోయేటంత బట్ట తయారు చేయిస్తున్నాను"

"నన్ను మీరు సరిగా అర్థం చేసుకోలేదు. నేను చెప్పేది 'అక్కడ రాత్రిపూట ఒంటరిగా వుండడం భయం' అని"

"ఓహో! అదా? నేను అప్పుడప్పుడు ఏదో ఆలోచిస్తూ ఏమో మాట్లాడుతుంటాను. చీకటిలో ఒంటరిగా అక్కడ వుండడం భయం అని – అంతేనా?"

"అదే నేను చెప్పదలచుకుంది" – కృష్ణారావు ఆశగా అతడి వంక చూశాడు.

"నీవు భయపడవలసింది ఏమీ అక్కడలేదు. మానవుడి కల్మషహస్తంచేత తాకపడని నిర్మల ప్రకృతి అది. బహుశా దేవుడి సృష్టిదినం నుంచి యీనాటి వరకు అందులో మానవుడు గొడ్డలిగాని, కొడవలిగాని చేతబట్టుకొని ప్రవేశించి వుండడు. సూర్యుడు అస్తమించేటప్పుడు ఆ తుమ్మలగుండా ఎప్పుడైనా చూశావా?"

"లేదు"

ఏ భయంకర దృశ్యాన్ని వర్ణించబోతున్నాడో అని కృష్ణారావు నిశ్చలంగా విశ్వానంద వంక చూస్తున్నాడు.

విశ్వానంద ఓ రీము కాయితాన్ని టేబిలు మీద నుంచి పైకెత్తి –

"ఇదిగో! వీటిల్లో రాసిందంతా ఆ ఒక్క దృశ్యాన్ని గురించే. సూర్యుడు పడమటి కొండచాటుకు వెళ్ళేటప్పుడు, క్రిక్కిరిసివున్న ఆ తుమ్మచెట్ల గుండా అతడు ప్రసరింపజేసే కాంతిపుంజాల్ని చూస్తూంటే – మనలో ఏమాత్రం భావనాబలం వున్నా, మన హృదయం మీద గుద్ది కరిగింపజేస్తుంది. ఈశ్వరుడు మానవుడిని ఆవరించివున్న చీకటితెరను తొలగించడానికి చేసే ప్రయత్నంలా తోస్తుంది. మనకు హృదయం వుండాలి! ఈశ్వర ప్రేరణ కావాలి! చూడు! ఇరవై దస్తాలకు పైనవున్న యీ కాయితాలలో రాసిందంతా తుమ్మల్లో ప్రొద్దు గ్రుంకడాన్ని గురించే – వీలున్నప్పుడు...."

"ఏ పత్రికకైనా పంపారా?" కృష్ణారావు నాలుక కొరుక్కున్నాడు. అప్రయత్నంగా వచ్చిన ప్రశ్న.

"పంపాను. కాని, గులాబీ పువ్వుల మీదా, సంపెంగ పొదల మీదా రాసిన కవిత్వాన్ని చదివి, సంతోషించే యీనాటి సంపాదకులకు – వట్టి ముడి ప్రకృతి మీద, వున్నదున్నట్టు రాసే కవిత్వం గుటక పడుతుందా? అయినా నేను నిరుత్సాహపడను. దైవప్రేరణవల్ల రాయబడిన యీ కవిత్వం, బహిర్గతమయే బాధ్యత ఎప్పటికైనా ఆయనే చూచుకుంటాడు."

అతడి ఆత్మవిశ్వాసాన్ని చూసి కృష్ణారావు ఆశ్చర్యపడ్డాడు.

"రాత్రిపూట ఒంటరిగా అలాంటి ప్రదేశాల్లో వుండే అలవాటు యింతవరకు నాకు లేదు. వీలుచూసి, యింకో యిల్లు యిస్తే బావుంటుంది" – కృష్ణారావు దీనాతిదీనంగా అడిగాడు.

విశ్వానంద పుస్తకాలు సర్దివేస్తూ –

"ఇంత చెప్పిన తరువాత కూడా నీవు యిలా అడగడం బాగాలేదు. సృష్ట్యాది నుంచి యీనాటి వరకు మానవుడిచేత తాకబడని నిర్మల ప్రకృతి! అలాంటి ప్రదేశంలో తిరిగే శక్తులు – శక్తులంటే పోలేరమ్మ, పెద్దేటమ్మ శక్తులనుకునేవు – అవిగాదు. ఆ భగవచ్ఛక్తులు, అలాంటి నిగూఢ ప్రకృతివెనక తిరుగుతుంటయ్. ఈ కలియుగంలో మనకై మనమే ప్రయత్నం చేసే దేవుడికంటపడాలి! ఆ అవకాశం – ఆ యిల్లు నీకు యిస్తుంది" – మాట పూర్తిచేసి విశ్వానంద ఒక తాళము, చెవి, కృష్ణారావు చేతికి యిచ్చాడు.

ఆ రాత్రి కృష్ణారావుకు నిద్దర పట్టలేదు. తాళం తీసి యింట్లోకి అడుగుపెడుతూనే కట్లపామును చూశాడు. ఇల్లంతా పందికొక్కులు తవ్విన కన్నాలూ, గోడల నిండా పగుళ్ళూ, వాటిని ఆనుకుని బయట జిల్లేడు మొక్కలూ, గచ్చపొదలూ, తుమ్మచెట్లూ, చిన్న చిన్న పొదలూ – అంతా ఓ భయం కర దృశ్యంలా అతని మనస్సులో హత్తుకుపోయి, కన్నుమూయడానిక్కూడా భయపడే స్థితికి వచ్చాడు.

సరిగ్గా అర్ధరాత్రికి అప్రయత్నంగా అలా కళ్ళు మూతపడేసరికి బయట ఏదో శబ్దం వినబడింది. అతడు వేగంగా కొట్టుకుంటూన్న హృదయంతో, లాంతరువత్తి కొంచెం పెద్దదిగాచేసి, చెవులు రిక్కించి విన్నాడు.

గోడ పక్కనే ఏదో పోరాటం ప్రారంభం అయింది. ఏమైవుంటుంది?

ముంగిస చేసే కీచు శబ్దం! పందికొక్కుల గోంద్రు! కొద్దిసేపట్లో యింకేదో కొత్త శబ్దం 'క్ర క్, క్ర క్' అంటూ వినబడ సాగింది. అది జముదు కాకి! సృష్ట్యాది నుంచి మానవుడిచేత తాకబడకుండా మడికట్టుక కూచున్న ప్రకృతి!

అంత భయపడుతూ వున్న స్థితిలో కూడా, అలాంటి ఆలోచన తనకు కలిగినందుకు నవ్వుకున్నాడు.

మసక మసక చీకటి వుండగా ఎవరో తలుపు తట్టారు. కృష్ణారావు చాప మీది నుంచి లేచివెళ్ళి తలుపు తెరిచాడు. దాదాపు డెబ్బది సంవత్సరాల ముసలాడు నమస్కరిస్తూ లోపలికి వచ్చాడు.

"కొత్తగా నిన్న వుద్యోగంలో చేరింది మీరేనా?" – కొత్త అనే బిడియం లేకుండా, పక్కగా

కూర్చుని ముసలాడు ప్రశ్నించాడు.

"అవును, నేనే" – కృష్ణారావు, ముసలాడి చొరవకు ఆశ్చర్యపోయాడు.

"ఆరు నెలల్లో యిద్దరు మీబోటి పడుచువాళ్ళు యీ యింట్లోనే ఆఖరిసారిగా వూపిరి పీల్చారు"

కృష్ణారావు మాట్లాడలేదు. అతడికేదో లోతు తెలియని అగాధంలోకి జారిపోతూన్నట్టు తోచింది.

"ఇక్కడ నేను పదిహేను సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాను. ముసలివాడి నయ్యాను. ఇక్కడే చచ్చిపోతాను కాని నీబోటివాళ్ళు యిక్కడి నుంచి తప్పుకోవడం మంచిది. రోగం వస్తే మందు యిప్పించేవాళ్లు కూడా లేరు" – ముసలాడు కృష్ణారావు వైపుకన్నా చూడకుండా మాట్లాడేస్తున్నాడు.

"మందుకూడా యిప్పించే దిక్కెందుకు లేదు? విశ్వానందగారు...." – విసుగ్గా తలవూపుతున్న ముసలాణ్ణి చూసి కృష్ణారావు మాట మధ్యలో ఆపేశాడు.

"నేను ఏడు గంటలకల్లా పనికిపోవాలి. అందువల్ల నీకు కొద్ది మాటల్లో యిక్కడి పరిస్థితి చెప్పేస్తాను. తరవాత నీ యిష్టం. కూర్చో"

ముసలాడు యిల్లు తనదైనట్టు కృష్ణారావును చాపమీద కూర్చోమని ఆహ్వానించాడు. తలుపు గడియవేయమని చెప్పి, సగం కాల్చిన ఎంగిలిచుట్టను ముట్టించి ప్రారంభించాడు.

"నీకు ఎంత జీతం యిస్తానన్నాడో అది నాకు చెప్పనవసరం లేదు. ఇక్కడే భోజనం యేర్పాటు వుంది. గనుక నెలాఖరుకు నీవు డబ్బడిగితే – 'ఏం చేసుకుంటావ్? నీ పేర జమకట్టి వుంచుతాలే' అంటాడు"

"నలభై రూపాయలు ఇస్తానన్నాడు. నేను యింటికి కొంత పంపుకోవచ్చుననుకున్నాను"

"అదేమీ సాగదు. 'కావాలంటే యీ నాలుగు రూపాయలు తీసుకో – తతిమ్మా డబ్బంతా ఆఖరుకు వెళ్ళబోయేటప్పుడిస్తా' నంటాడు. గట్టిగా అడిగితే...అసలు యిక్కడ నీకు వున్న ఖర్చేమిటో? సిగరెట్టు తాగే అలవాటు ఉన్నదని అంటే – అందువల్ల కలిగే అనారోగ్యం, యింటికి డబ్బు పంపుకోవాలంటే – ఎవరి కాళ్ళ మీద వాళ్ళు బతకవలసిన అవసరం – అంతా అద్వైతం, చిత్తు, సత్తు"

ముసలాడు అసాధ్యుడులా ఉన్నాడు. కృష్ణారావుకు అనుకోకుండానే అతడి మీద గౌరవం, నమ్మకం కలిగింది.

"ఇద్దరు చచ్చిపోయారన్నావ్. ఎందువల్ల జబ్బు చేశా?"

"జబ్బు చేసే. కాని మందు యిప్పించే దాత వుంటే జబ్బు చేసిన ప్రతివాడూ చావడు"

"మరి వాళ్ళెందుకని మందు తీసుకోలేదు?"

"వాళ్లు మందు తీసుకోకపోవడం కాదు? వాళ్ళు చస్తూ కూడా మందు కావాలంటూనే చచ్చారు" – ముసలాడు గట్టిగా గోడ మీద ఉమ్మేశాడు.

"అంతా సత్తు, చిత్తు"

"డాక్టరు అందుబాటులో లేడనుకుంటాను"

"డాక్టరు లేక కాదు. నీవు విశ్వానందగారంటున్నావే, ఆయనకు, వాళ్ళ రోగం మందులవల్ల

కుదిరేదికాదని నమ్మకం. ఆయనేమో కాస్త పడిశం పట్టినా డాక్టరుచేత అయిదారుసార్లు పరీక్ష చేయించుకుని మందు తీసుకుంటాడు. కారణం, ఆయన తన ఆత్మను, శరీరాన్ని ఈశ్వరుడికి అంకితం చేశాడు కనక, ఆయన కోసం వాటిని కాపాడాలి! ఇక నువ్వూ, నేనూ శరీరాన్ని, ఆత్మను ఆ దేవుడికి స్వాధీనం చేయలేదు కనక, అది జరిగే వరకూ రోగం వచ్చినా మందులూ మాకులూ తీసుకోగూడదు. ప్రార్థన చేయాలి"

"అంటే!"

"అంటే సత్తు, చిత్తు! ఆత్మ – పరమాత్మ! కర్మ, పూర్వజన్మం! నాకు యీ పదిహేను సంవత్సరాల్లో చాలా వేదాంతం అబ్బింది"

ముసలాడు చుట్ట అవతలపారేసి లేస్తూ –

"సాయంకాలం వచ్చి మాట్లాడతాను. వేళ అయింది. పని కెళ్ళాలి"

"అసలు – ఆరు నెలల్లో ఆ యిద్దరూ ఎలా చచ్చిపోయారో చెప్పలేదు"

ముసలాడు వంగి, చాపను పైకెత్తి పరీక్షగా చూచి నవ్వుతూ అన్నాడు :

"ఇదిగో! యీ చాపమీదే వాళ్ళిద్దరూ ప్రాణాలు వదిలారు. ఒకడు చస్తూ కూడా 'క్వినైన్ బిళ్ళలు, క్వినైన్ బిళ్ళలు' అనడం మానలేదు"

"రెండో అతను?" – కృష్ణారావుకు అంతా ఓ భయంకర స్వప్నంలా వుంది.

"రెండోవాడు అచ్చంగా నీలాగా, సన్నగా వుండేవాడు. అయితే నీకన్న కాస్త ఎరుపు. ఎంత హుషారైన మనిషి! అందర్నీ నవ్విస్తూ వుండేవాడు"

"అతనికి ఏం జబ్బు చేసింది?"

"న్యుమోనియా అని అతనే నాకు చెప్పాడు. వాళ్ళ అన్నయ్య ఎక్కడో డాక్టరనీ – తనకూ కొంత వైద్యం తెలుసనీ అంటూండేవాడు. కాని ఏం లాభం? జ్వరం వచ్చిన అయిదారు రోజులకల్లా చచ్చిపోయాడు"

"మందు ఎందుకని యిప్పించలేదు?"

"మందు యిప్పించకపోయినా – కనీసం అతడు కోరినట్టన్నా విశ్వానందగారు నడుచుకున్నట్టయితే బతికేవాడనుకుంటాను. న్యుమోనియా రోగికి చలిగాలి తగలగూడదని యీ తలుపు, ఆ కిటికీ మూయమంటుండేవాడు. కాని యీ ఆనందగారు – 'ప్రకృతి ప్రసాదించే గాలివెలుగుల్ని తిరస్కరించడానికి వీడెవడు? ఈశ్వర నామం జపించు' మంటూ అన్నీ బార్లా తీసి వుంచుతుండేవాడు. పాపం! అతడు ఆఖరి క్షణాల్లో 'గొంగళి! గొంగళి' అంటూ ప్రాణం వదిలాడు"

కృష్ణారావు ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు.

"కాని తరవాత విశ్వానందగారు చాలా బాధపడి ఉంటాడు" అన్నాడు.

గడియ తీసేందుకు తలుపు దగ్గిరకువెళ్ళిన ముసలాడు ఆగాడు –

"తరువాత బాధపడటంకాదు, ఉత్సాహపడుతున్నాడు. తను యిద్దరు గడ్డు నాస్తికుల్ని ఆఖరి క్షణాల్లో నరకబాధల నుంచి కాపాడానని అందరితో చెపుతుంటాడు. ఆ క్వినైన్ అంటూ చచ్చిన

అతను, 'కృష్ణా' అంటూ ప్రాణాలు వదిలాడనీ – 'గొంగళి, గొంగళి' అంటూ మరణించిన అతను, 'గోవిందా, గోవిందా' అన్నాడని. అంతా సత్తు, చిత్తు –"

తలుపు గడియ తీసి ముసలాడు బయటకు వెళ్ళిపోయాడు.

ఆ పగలల్లా కృష్ణారావు మానసికంగా చాలా బాధపడ్డాడు. ఇంతకంటె మంచి వుద్యోగం తన కెక్కడా దొరకదు. కాని – ఆ ముసలాడు చెప్పినదంతా నిజమైతే తను ఎక్కువ కాలం యిక్కడ ఉండగలగడంగాని – అసలు వుండి బతకగలగడంగాని చాలా అనుమానాస్పదం. ఇల్లంతా ఎంతో బీభత్సంగావుంది. పైగా యిద్దరు ప్రాణాలు వదిలిన ఆ చాప! ఆ రాత్రంతా భయంకరమైన కలలతో నిదరపట్టక అమిత బాధపడ్డాడు. కళ్ళు మూస్తే, జముడు కాకులు, తుమ్మచెట్లు, పందికొక్కులు, ముంగిసలు, కట్లపాములు –

మరుసటిరోజు సాయంత్రం తలుపు తీయగానే ఏదో పాము చర్రున గోడ పగుళ్ళలోకి పోయి దాక్కుంది. చిత్తుకాయితాలు మంటపెట్టి దాన్ని అక్కడ నుంచి బయటకు వచ్చేటట్టు చేసి చంపాడు. అదీ కట్లపామే! పదహారు కట్లు!

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలకు, విశ్వానందను మామూలుగా ప్రతి పదిహేను రోజులకు, ఆరోగ్యం విషయమై పరీక్ష చేయడానికి వచ్చే డాక్టరు రామారావు కనబడ్డాడు. ఆయనతో తన గోడంతా చెప్పుకుని, కనీసం మరో యిల్లు యిప్పించేందుకు విశ్వానందకు సిఫారసు చెయ్యమన్నాడు.

ఆయన కృష్ణారావు వంక జాలిగా చూసి –

"ఆయనతో యిలాంటి విషయాలు నేను మాట్లాడను. కావాలంటే నీకు జబ్బు చేసినప్పుడు కబురుచేస్తే వుచితంగా మందిస్తాను, ఏదో కుర్రవాడివి"

డాక్టరు పోయేటప్పుడు కారు దాకా వెళ్ళి – 'యింక మీరే నాకు దిక్కు' అన్నట్టు జాలిగా ఓ చూపు చూసి తిరిగివచ్చాడు.

ఆ రాత్రి తోడుగా పడుకునేందుకు ముసలాణ్ణి పిలుచుకొచ్చాడు. తుమ్మచెట్లలో నుంచి జముడు కాకులూ, యింకా యేవో యితర జీవాలు మామూలు కంటె ఎక్కువ గోల చేసినై. చూరు కింద, జిల్లేడు చెట్లలో, గచ్చపొదల్లో వివిధ ప్రకృతి ప్రాణుల పోరాటం, మధ్య మధ్య రాజీ –

బాగా పొద్దుపోయి, ఏదో కొంచెం కునుకుపట్టేటట్టుగా వున్న దశలో కృష్ణారావుకు ఏదో కుట్టినట్టు – కాదు కరిచినట్టు తోచింది. మామూలుగా ఎలుకలు కాలి గోళ్ళనూ, చేతి గోళ్ళనూ తినడం రోజూ నిద్రలో వుండగా జరుగుతూనే వుంది. కాని ఆ అనుమానం ఒక్క క్షణంలో, అతడికే నివృత్తి అయింది. దుప్పటి కింద, యిటూ అటూ వేగంగా కదుల్తూ, పారిపోయేందుకు ప్రయత్నం చేస్తోంది పాము!

పెద్దగా కేక వేశాడు.

కేక వింటూనే ముసలాడు ఎగిరి కూర్చున్నాడు. కృష్ణారావు తడబడుతుండటాన్ని చూసి, లాంతరు వత్తి పెద్దదిగా చేసి దగ్గరకు తీసికెళ్ళాడు.

లాంతరు వెలుగులో - దుప్పటి కింద నుంచి గోడ కన్నంలోకి చర్రున పరుగెత్తిన పామును ముసలాడు స్పష్టంగా చూశాడు. నూనె పలుగుడు! కట్లపాము కంటే ప్రమాదకరం!!

వెలుగు చూస్తూనే కృష్ణారావు కూర్చున్నవాడల్లా వెల్లకిలా పడిపోయాడు. అస్పష్టంగా 'రామారావు' అన్నాడు.

ముసలాడు పిలవగానే విశ్వానంద బయలుదేరి వచ్చాడు.

కృష్ణారావు చాప మీద మెలికలు తిరిగిపోతూ, ఏదో మధ్య మధ్య అంటున్నాడు.

విశ్వానంద నిర్వికారంగా అతడి దగ్గరకు వెళ్ళి తలగడ కింద చేయిపెట్టి వెతికాడు.

"లేదు! తలగడ కింద పెట్టుకుని పడుకోమని హనుమద్దండకం యిచ్చాను. కాని ఆ పని చేయలేదు. మరి యిప్పుడు రామా! రామా! అంటే ప్రయోజనం?"

"రామా రామా - కాదు. డాక్టరు రామారావుగారి కోసం...."

కళ్ళెర్రచేసి ఉగ్రనరసింహాకృతి దాల్చిన విశ్వానందను చూసి, ముసలాడు అంతటితో ఆగిపోయాడు.

"పదిహేనేళ్ళ నుంచి యిక్కడ వుంటున్నా, ఆ పరమార్థతత్వం ఏమీ నీ బుర్ర కెక్కలేదు. మనిషి చచ్చిపోయేటప్పుడు యమకింకరులు జీవుణ్ణి గొలుసులతో బంధించేటందుకు ప్రయత్నం చేస్తూండే స్థితిలో, ఎవడైనా డాక్టరు రామారావు కోసం కబురు చేయమంటాడా? పిచ్చివాడా! అతడి ఆత్మ డాక్టరు రామారావు కోసం కాదు యిప్పుడు తపించుచున్నది - ఆ అయోధ్య రాముడి కోసం - కాని చాలా ఆలస్యంగా - అకాలంగా....." - విశ్వానంద కళ్ళు తుడుచుకున్నాడు.

"రైల్వే స్టేషనుకు తీసుకుపోతే, మంత్రం...."

విశ్వానంద సింహంలాగా ఛెంగున లేచాడు.

"ఓరి దైవద్రోహీ! చచ్చిపోయేవాళ్ళ ఆత్మల్ని కూడా మంత్రతంత్రాల వైపు తిప్పేందుకు ప్రయత్నంచేసే పాషండుడా..." - విశ్వానంద వుద్రేకంతో యిక మాట్లాడలేకపోయాడు.

కృష్ణారావు కొంత తెప్పరిల్లి "మళ్ళీ తెర రాకముందే ఆయన్ని రా-మా-రా-" - మళ్ళీ తెర వచ్చి అతడు చాపమీద పాములాగా మెలికలు తిరిగిపోతున్నాడు.

విశ్వానంద కృష్ణారావు పక్కగా చాపమీద కూర్చుని విచారంగా అన్నాడు -

"రాడు, నాయనా, రాడు. త్రేతాయుగంలో వచ్చి దర్శనమిచ్చినంత తేలిగ్గా - యీ పాడు కలియుగంలో పిలవగానే వచ్చి దర్శనం యివ్వడు" - విశ్వానంద మళ్ళీ కళ్ళు తుడుచుకున్నాడు.

కొద్దిసేపట్లో కృష్ణారావు చాపమీద మెలికలు తిరగడం మానేశాడు!

బయట - సృష్ట్యాది నుంచి యీనాటి వరకు మానవుని చేత తాకబడని నిర్మల ప్రకృతిలో, దేవుడు సృష్టించిన వివిధ జీవులు కీచులాడుకుంటున్నాయి.

❋

(తెలుగు స్వతంత్ర : 1-3-1949)